క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక సూర్యనగర్‌లోని సంపత్ వినాయక ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వినాయకుడికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. పీసపాటి లక్ష్మీపతి, వెంపరాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేద పండితులు గణపతి హోమం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రతినిధి హెచ్ఎస్ రామకృష్ణ, అర్చకుడు రాజుబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో పర్యాటకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ



అజయ్ జైన్‌కు అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర పర్యాటక, యువజన సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ బుధవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాలను డిప్యూటీ ఈవో రాధ అందజేశారు.


అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



ఏఈవోకు చెక్కు అందిస్తున్న దాత అన్నపూర్ణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని పాత డెయిరీ ఫామ్‌కి చెందిన జి.అన్నపూర్ణ అనే దాత రూ.లక్ష 116 విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావుకి సింహగిరిపై బుధవారం ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీర్వచనంని అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళలు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో జరుగుతున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పలు ఆటల పోటీలు నిర్వహించారు. కాలనీలోని చిన్నారులకు కలర్స్ చేంజ్, వాటర్ బాల్, మహిళలకు మ్యూజికల్ చైర్ తదితర పోటీలు జరిపారు. కాలనీలోని మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున పోటీల్లో పాల్గొన్నారు. తమదైన శైలిలో ఉత్సాహంగా ఆటలాడి అబ్బురపరిచారు. కాలనీ అసోసియేషన్, సింహపురి యువత ఏర్పాట్లు పర్యవేక్షించింది.

వ్యాధుల కాలం.. అప్రమత్తతే శరణ్యం





వర్షాకాలం.. శీతాకాలం.. దోమల వ్యాప్తికి చాలా అనుకూలం. ఆ సమయాల్లోనే ఎక్కువగా సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. ప్రస్తుతం రెండింటికి మధ్య సంధికాలం. దీంతో సబ్బవరం మండలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య సిబ్బంది హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో పర్యటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- ముందు జాగ్రత్త చర్యలతో సీజనల్ జ్వరాలకు చెక్
- దోమల వృద్ధిని అరికడితే సంపూర్ణ ఆరోగ్యం
- అవగాహన కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది



డ్రమ్ముల్లో నిల్వ నీటిని పారబోయిస్తున్న సిబ్బంది

సబ్బవరం: ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు మండలంలో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా తదితర విష జ్వరాలు అధికంగా కనిపిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాల్సిన సమయమిది. ఈ కాలంలో వర్షాలు ఎక్కువగా కురవడం, నీరు ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోతుండటంతో వ్యాధి కారక దోమలు వృద్ధి చెందే పరిస్థితి. కొద్దిపాటి అవగాహన, ముందు జాగ్రత్త చర్యలు పాటిస్తే మేలని అధికారులు, వైద్య ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లోని కాలనీలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

డ్రైనేజీ అస్తవ్యస్తం

సబ్బవరం మండలంలో 20 గ్రామ సచివాలయ పరిధిలో 24 పంచాయతీలున్నాయి. చాలా గ్రామాలతో పాటు మండల కేంద్రం సబ్బవరంలో డ్రైనేజీ పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచిపోతోంది. వర్షం కురిసిందంటే రోడ్లన్నీ కంపుకొడుతున్నాయి. దీంతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. జ్వరాలు ఎక్కువగా నమోదవడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది సబ్బవరం, గుల్లేపల్లి పీహెచ్‌సీలతో పాటు మండలంలోని అన్ని వెల్‌నెస్ సెంటర్లలో మలేరియా, డెంగ్యూ పరీక్షలు తరచూ నిర్వహిస్తున్నారు.

నిల్వ నీరుతోనే దోమల వ్యాప్తి

మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే దోమల వ్యాప్తిని అరికట్టాలి. ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెంది, వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, రుబ్బు రోళ్లు, తాగి పడేసిన టీ కప్పులు, బాటిళ్లు, ఫ్రిజ్ వెనుక ఉండే డ్రిప్ బాక్స్, కూలర్లు, మనీ ప్లాంట్లలోని దోమలు పెరుగుతాయి. వారానికి పైగా నీరు నిల్వ ఉండే కుండీలు, డ్రమ్ములు, కాల్వల్లో దోమలు చేరి గుడ్లు పెడతాయి. ఒక దోమ 200 నుంచి 250 వరకూ గుడ్లు పెడుతుంది. ఇవన్నీ 10 నుంచి 12 రోజుల్లో దోమలుగా వృద్ధి చెంది జ్వరాలను వ్యాప్తి చేస్తాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముందస్తు చర్యలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని మూడు కంటే ఎక్కువ డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైన సచివాలయాన్ని హాట్ స్పాట్‌గా గుర్తించేవారు. ఆయా హాట్ స్పాట్లలో కేసులు నమోదుకాకుండా మండల స్థాయి యంత్రాంగం, వైద్య ఆరోగ్య సిబ్బంది, జిల్లా మలేరియా విభాగం ప్రత్యేక కార్యాచరణతో దోమల నిర్మూలనకు కృషి చేసేవారు. గత ఏడాది కంటే డెంగ్యూ కేసులు ఈ ఎడాది కాస్త తగ్గినా.. దాదాపు ఇంకో రెండు నెలల కాలం మిగిలే ఉంది. ఇప్పుడు వర్షాలు కూడా తరచూ కురుస్తుండటంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా జాగ్రత్తలు పాటించడం మేలని ఆరోగ్య సిబ్బంది సూచిస్తున్నారు.



డ్రైన్‌లోని మురుగునీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



సబ్బవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, డాక్టర్ ఆశ తదితరులు

దోమల్ని అరికట్టాలంటే..

- దోమలు వ్యాప్తి అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలి.
- కనీసం వారినికో రోజు డ్రైడే పాటించి, ఇళ్లలో నిల్వ నీరు, పాత్రలు, కుండీలు, డ్రమ్ముల్లో నీటిని పారబోసి బాగా ఆరబెట్టాలి.
- నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, ట్యాంకులపై మూత పెట్టాలి.
- ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్స్, కూలర్లను వారానికి ఒకసారి శుభ్రం చేయాలి.
- నీటిలో దోమల లార్వా పెరుగుతున్నట్లు గుర్తిస్తే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి.
- దోమలు కుట్టకుండా శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు, దోమ తెరలు వాడటం మంచిది.

దోమల నియంత్రణ సామాజిక బాధ్యత



ఏటా జూన్ నుంచి అక్టోబర్ చివరి వరకు డెంగ్యూ, మలేరియా తదితర విష జ్వరాలు ఎక్కువగా ఉంటాయి. ఇందుకు కారణమైన దోమల వృద్ధిని అరికడితేనే జ్వరాలను నియంత్రించగలం. మండలంలోని పీహెచ్‌సీల పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది, జిల్లా మలేరియా విభాగం, మండల పరిషత్ యంత్రాంగం ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. డ్రైడేపై అవగాహన పెంచుతున్నారు. దీన్నొక సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రజలు కూడా సహకరించాలి.

– డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి, ప్రధాన వైద్యాధికారి, పీహెచ్‌సీ, సబ్బవరం

నిరంతర అధ్యయనంతో మెరుగైన బోధన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు అధ్యాపకులు సాంకేతిక రంగంలో జరుగుతున్న రోజువారీ మార్పులపై నిరంతరం అధ్యయనం చేయాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ సూచించారు. కళాశాలలో బుధవారం ఏఆర్ఎం కార్టెక్స్ ఎం3 ఆధారిత ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్(ఎఫ్‌డీపీ)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతులతో అధ్యాపకులకే కాకుండా విద్యార్థులకు కూడా పరిశ్రమలలో అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈసీఈ విభాగాధిపతి, శిక్షణ కార్యక్రమ సమన్వయకర్త ఎం.నాగమణి పలు సూచనలు, సలహాలు అందించారు. మై యాక్సెస్ సంస్థ వ్యవస్థాపకుడు తామరపల్లి సూర్య ఆధ్వర్యంలో జరిగిన తొలి రోజు కార్యక్రమంలో 5 ప్రభుత్వ, 10 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్తికేయుని సన్నిధిలో సింహాచలం ఈవో



కృష్ణాజిల్లా మోపిదేవిలో స్వామివారి చిత్రపటం అందుకుంటున్న ఆర్‌జేసీ త్రినాథరావు

మోపిదేవి(కృష్ణాజిల్లా): కృష్ణాజిల్లా మోపిదేవిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయ శాఖ ఆర్‌జేసీ, సింహాచలం ఇన్‌చార్జి ఈవో వి.త్రినాథరావు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసి, నాగపుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు ఫణికుమార్‌శర్మ, వెంకటేశ్వరరావు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరుబాట



నిరసన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అగనంపూడి: పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11నుంచి 19వ తేదీ వరకు జరపతలపెట్టిన నిరసన కార్యక్రమాల పోస్టర్‌ను ఏపీటీఎఫ్‌నాయకులు ఆవిష్కరించారు. స్థానిక హైస్కూల్‌లో ఏపీటీఎఫ్ గాజువాక మండల కమిటీ నాయకులు, జిల్లా కౌన్సిలర్లు, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో గాజువాక కమిటీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు చెల్లించాలని, అలాగే కూటమి హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం పరిమితి పెంచాలన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆర్థికంగా నష్టపరిచే కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు. వారం రోజుల పాటు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. అలాగే ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పి.అప్పారావు, ఆర్టీడీ నాయుడు, బి.త్రిలోక్, సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు నివారించదగినవే..



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.ఎస్.రాజు

సీతంపేట: ఇటీవల పెరుగుతున్న ఆత్మహత్యలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని భారతీయ మానసిక వైద్య సంఘం పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.రాజు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రతి లక్ష మందిలో 12 నుంచి 15 మంది ఏటా క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ఇవి చాలా వరకు నివారించదగినవే అని అన్నారు. ఆత్మహత్యలకు దారితీస్తున్న పరిస్థితుల పట్ల ప్రజల్లో అవగాహన పెరిగి సత్వర నివారణ చర్యలు చేపడితే చాలా మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమలో వైఫల్యాలు, భార్యాభర్తల గొడవలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, మత్తు పదార్థాలు సేవించడం, మానసిక అనారోగ్యం తదితర అంశాలు చాలా వరకు ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని వివరించారు. పిరికి మనస్కులు, కష్టనష్టాలు ఉన్నవారు మాత్రమే బలవన్మరణాలకు పాల్పడతారని, వాటిని నివారించే శక్తి వేరే వారికి లేదనేది పూర్తిగా అవాస్తమన్నారు. ఆత్మహత్య ప్రయత్నం చేసే వారు మానసిక దౌర్బల్యం ఉన్నవారనేది అపోహ మాత్రమేనని, శారీరక రోగాల మాదిరిగా మానసిక ఆందోళన, దిగులు వంటి పరిస్థితులను కౌన్సెలింగ్, మందుల ద్వారా నయం చేసుకోవచ్చని చెప్పారు. డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ ఆత్మహత్యలను నివారించే దిశగా ప్రజలను అప్రమత్తం చేయడమే బాధ్యతగా ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కాదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు.

అధినేతతో అదీప్‌రాజ్ భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అదీప్‌రాజ్

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం కలుసుకున్నారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో అధినేతను కలిసి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను వివరించారు. అదీప్‌రాజ్‌కు వైఎస్ జగన్ పలు సూచనలు చేశారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సబ్బవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుంచి సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని కోరారు.

అధికారుల దృష్టికి ప్రయాణికుల కష్టాలు

అగనంపూడి: పకీర్‌తక్యా నుంచి కాపు జగ్గరాజుపేట మీదుగా నగరానికి వెళ్లే మార్గంలోని అండర్‌పాస్ వంతెన వద్ద ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు, కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కాటం చంద్రరావు, విజయ్‌కుమార్ అన్నారు. ఎన్టీపీసీ ట్రాక్ కిందన నిర్మించిన వంతెన మలుపుల్లో స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా వేయడం వల్ల కారు బోనెటర్, సాచిలు స్పీడ్ బ్రేకర్‌కు తగిలి మరమ్మతులకు గురవుతున్నాయని చెప్పారు. ఈ సమస్య పరిష్కరించాలని తూర్పు కోస్తా రైల్వే ముఖ్య కార్యాలయానికి లేఖ రాయడంతో పాటు ట్విటర్ వేదిక సమస్యను వివరించనట్టు వారు బుధవారం తెలిపారు. అక్కడ రోడ్డు భద్రతా గుర్తులు, సూచికలు , విద్యుద్దీకరణ చేపట్టాలని వారు కోరారు.

ఆ నీటిని అనకాపల్లి, నరవకు మళ్లించొద్దు



అగనంపూడి వాటర్ ప్లాంట్ నీటి గురించి ఎస్ఈ పల్లంరాజుతో మాట్లాడుతున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85, 88 వార్డుల్లోని అగనంపూడి, దువ్వాడ పరిసర గ్రామాల కోసం నిర్మించిన 85 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కర్మాగారం నుంచి అనకాపల్లి, నరవ ప్రాంతాలకు నీటిని తరలించొద్దని అగనంపూడికి చెందిన నాయకులు జీవీఎంసీ నీటిసరఫరా విభాగం ఎస్ఈ పల్లంరాజుకు వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి, నరవ ప్రాంతాలకు తరలించడం వల్ల తమ ప్రాంతాలకు సరిపడా నీరు అందడం లేదని వివరించారు. అలాగే సూదికొండ దిగువ ప్రాంతాలకు పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అలాగే అనకాపల్లి కొప్పాక వద్ద మురుగునీరు, కలుషిత నీరు ఏలేరు కాల్వలో కలుస్తుందని ఈ విషయంలో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, రమేష్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

'పశువుల పాకల తొలగింపు నిలిపేయాలి'



డీటీకి వినతిపత్రం అందిస్తున్న బాధిత దళితులు

సబ్బవరం: మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో వందేళ్లకు పైగా తాతల కాలం నుంచి పశువుల పాకలు వేసుకుని పశువుల్ని మేపుకుంటూ జీవనోపాధి సాగిస్తున్న తమ పాకల్ని రహదారి నిమిత్తం ధ్వంసం చేశారని, వెంటనే తొలగింపుల్ని నిలిపేయాలంటూ స్థానిక దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అప్పారావుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాధిత దళితులు మీడియాకు వివరాలు తెలిపారు. ఎల్లుప్పి రెవెన్యూ పరిధి సర్వే నెం.16లో 2.48 ఎకరాల స్థలంలో పశువుల పాకలు వేసుకున్న తమ సమీపంలో జంపన కృష్ణంరాజు అనే వ్యక్తి 150 ఎకరాల భూమి ఉందన్నారు. సర్వే నెం.10, 16లలో మొగల్ చెరువుకు వెళ్లే గెడ్డవాగు స్థలాన్ని పూడ్చేసి నీరు వెళ్లకుండా చేసి కృష్ణంరాజుకు రోడ్డుగా మార్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు సరిపోలేదని మరింత విస్తరించేందుకు తహసీల్దార్ ఆదేశించారని దీంతో ఆర్ఐ వీరయ్య, వీఆర్వో గోవింద్, వీఆర్ఏ వై శేషగిరిరావులు దౌర్జన్యంగా బోను గంగునాయుడుకు చెందిన పొక్లెయిన్‌తో పాకల్ని ధ్వంసం చేశారని ఫిర్యాదులో తెలిపారు. సమగ్ర విచారణ జరిపి గెడ్డవాగు అక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో కాకర అమ్మతల్లి, కాకర వెంకటరమణ, కాకర గోపీనాథ్, కె.చినఅప్పలరాజు, మచ్చ దేవుడు, కె.చండేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'ఫొటో, వీడియోగ్రాఫర్లకు చేయూతనివ్వాలి'



ఆత్మీయ సమావేశంలో మండలంలోని ఫొటో, వీడియోగ్రాఫర్స్

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం వద్ద సబ్బవరం మండల శ్రీదుర్గమాంబ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సమస్యలపై చర్చించి, ప్రభుత్వం తమను గుర్తించి చేయూతను ఇవ్వాలని కోరారు. ఈ సమావేశానికి మండలంలోని 70 మంది వరకూ ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కామిరెడ్డి అప్పారావు, ఉపాధ్యక్షుడు శీరం రాజేష్, కార్యదర్శి బొజ్జ శివ, సంయుక్త కార్యదర్శి జి.మధు, కోశాధికారి సుంకర శివ, అడ్వయిజరీ కమిటీ గౌరవ అధ్యక్షుడు పోనగంటి కిశోర్, మేడపాటి రాము, ముమ్మన అప్పలరాజు, ఆరిపాక ప్రసాద్, ఎస్ శ్రీను, మిడతాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నీ

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా త్వరలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నమెంట్ జరగనుందని ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ వెల్లడించారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగంలో ఆయన అధ్యక్షతన బుధవారం ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్సెస్ 2025–26 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయమోహన్ మాట్లాడుతూ ఈ నెల 15న ఆర్చరీ పురుషులు, మహిళల విభాగంలో యూనివర్సిటీ జట్టు ఎంపిక ఉంటుందన్నారు. ఈ నెల 25న యోగా పురుషులు, మహిళల జట్టు ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ కాలేజీ క్రీడలు మహిళలు, పురుషుల విభాగంలో జరుగుతాయని చెప్పారు. కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, హ్యాండ్‌బాల్, కోకో, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, కిక్ బాక్సింగ్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఐదు జిల్లాలకు చెందిన ఏయూ అనుబంధ కళాశాలల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఇంటర్ కాలేజ్ క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులకు సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఏయూ వ్యాయామ విభాగాధిపతి ఆచార్య పల్లవి మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎం.ఆర్.కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాసుదేవరాజు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఎల్.బి.కళాశాల వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.